క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు కస్తూర్బా విద్యార్థిని


గొల్ల రాజేశ్వరి

గోనెగండ్ల : జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని గొల్ల రాజేశ్వరి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విద్యావతి గురువారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగాయి. ఇందులో తమ విద్యార్థిని గొల్ల రాజేశ్వరి తన సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని సాధిస్తాం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని సాధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీలో ఆస్తి పన్ను రూ.17 కోట్లు లక్ష్యం కాగా, రూ.7.62 కోట్లు వసూలు అయ్యాయని తెలిపారు. నీటి పన్ను రూ.11 కోట్లు లక్ష్యం కాగా, అందులో రూ.1.82 కోట్లు వసూలు అయ్యాయని చెప్పారు. మిగిలిన బకాయిలను మార్చి ఆఖరిలోగా వసూలు చేసి లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. పట్టణ ప్రజలు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల నిర్వాహకులు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మొండిబకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

ఎమ్మిగనూరుటౌన్: డిగ్రీ,ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో వున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను ప్రభుత్వం సత్వరం చెల్లించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు విష్ణు,అబ్దుల్‌ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2100 కోట్లు, వసతి దీవెన కింద రూ.1480 కోట్లు పెండింగ్‌లో వున్నాయన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై అదనపు భారం తగ్గించండి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయులపై అదనపు భారం తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్రయాదవ్ గురువారం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న సిద్దయ్యశెట్టి అనే ఉపాధ్యాయుడు ఎస్ఎ-1 పరీక్షలలో భాగంగా ప్రశ్నపత్రాలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం నుంచి తీసుకొని వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మరణించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు మృతికి ఎవరు బాధ్యుల వుతారని ప్రశ్నించారు. మృతుని కుటుంబానికి వారు ప్రగాఢసానుభూతిని తెలిపారు.


శత జయంతి ఉత్సవాలు విజయవంతం చేద్దాం

ఎమ్మిగనూరుటౌన్: ఈ నెల 26న సీపీఐ కార్యాలయాల్లో నిర్వహించే సీపీఐ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు పంపన్న గౌడ్, భాస్కర్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏఐటీయూసీ తాలూకా నాయకుడు విజయేంద్ర ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 1925వ సంవత్సరం డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. శత జయంతి ఉత్సవాల్లో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

కోసిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తి విస్మరించి ప్రజలపై పెను భారాలు మోపుతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం కోసిగిలో కల్రెప్ప అధ్యక్షత సీపీఎం మండల మూడవ మహాసభలు నిర్వహించారు. అనంతరం సీపీఎం మండల నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో మండల అధ్యక్షుడుగా రాముడు, కమిటీ సభ్యులుగా వీరేష్, హనుమంతు, నాగేంద్ర, ఈరన్న, లను ఎనుకున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న ఆల్‌ఫ్రెడ్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణంలో మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు 300ల మంది వృద్ధులకు, వితంతువులు, దివ్యాంగులకు గురువారం స్థానిక క్రిష్టియన్ రిఫార్మ్ చర్చిలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ చర్చి పాస్టర్ రవితేజ క్రీస్తు బోధనలను వినిపించారు.

ఎనీటైం.. ఎనీ బ్రాండ్!

- టీడీపీ పెద్దల అండ దండలతో ఊరూరా బెల్టు షాపులు
- అధిక ధరలకు విక్రయాలు
- మద్యం మత్తులో చిత్తవుతున్న గ్రామీణులు
- నామమాత్రపు దాడులతో సరిపెడుతున్న అధికారులు



నాగలదిన్నె నుంచి నందవరానికి మార్చిన మద్యం షాపు దృశ్యం

నందవరం : బెల్టుషాపులకు విరుద్ధమంటూ వేదాలు వల్లించిన టీడీపీ నేతలు వారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి అనుచరులే ఊరూరా బెల్ట్‌షాపులను తెరిచారు. పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. మందు బాబులు నిత్యం మత్తులో తూగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఎమ్మార్పీ కంటే చాలా ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. వారికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు.

120కి పైగా బెల్టు షాపులు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇవి కాకుండా పల్లెల్లో గ్రామాల వారీగా రెండు నుంచి మూడు చొప్పున బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని నందవరం,ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాల్లో 120పైగా బెల్టుషాపు ఉన్నాయి. నందవరం మండలంలో దాదాపు 35 నుంచి 40 బెల్టు షాపులు ఉన్నాయి. మండలంలో అత్యధికంగా కనకవీడు, హాలహర్వి, నందవరం, సోమలగూడూరు గ్రామాల్లో బెల్టు దందా సాగుతోంది. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించడానికి వీలులేదని..బెల్టు షాపు నిర్వహిస్తే బెల్ట్ తీస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక జారీ చేసినా.. కూటమి నాయకులే వాటిని పాటించడంలేదు. మద్యం షాపుల ద్వారా మద్యం గ్రామాలకు సరఫరా చేస్తుడడంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాలలో అధికార పార్టీ నాయకుల అండదండలతోనే బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వారిక వాటాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా మండలంలోని నాగులదిన్నెలో టీడీపీ నాయకుడు ఏర్పాటు చేసిన 56వ నంబర్ వైన్ షాపుపై రాజకీయ వేధింపులు ఎక్కువ కావడంతో దానిని మండల కేంద్రానికి మార్చారు.

> **ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు**
>
> గ్రామాల్లోని పలు దుకాణాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోనే బెల్టు షాపు ఉండడంతో తాగిన మద్యం సీసాలు ఇళ్ల పరిసర ప్రాంతాల్లోనే పడేస్తున్నారు. మద్యం సేవించి అరుపులు, కేకలు వేస్తున్నారని, వీటితో విసిగెత్తి పోతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బెల్టు షాపులో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు (ఫైల్)

ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.20 నుంచి రూ.50

అధిక ధరలకు విక్రయిస్తున్న సంబంధిత ఎక్సైజ్ శాఖ పట్టించుకోలేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం బాటిల్‌పై అదనంగా వసూలు చేస్తున్నట్లు మందు బాబులు వాపోతున్నారు. ఒక్కొక్క బాటిల్‌కి రూ.20 నుంచి రూ.50 అధనంగా వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ బెల్టు షాపులపై అధికారులు కన్నెత్తి చూడలేని సాహసం చేయలేకపోతున్న దుస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని గ్రామాల్లో ఎక్సైజ్, పోలీసులు దాడులు చేసి బెల్టు షాపు నిర్వాహకులను అదపులోకి తీసుకుని, కేసులు పెట్టిన మరుసాటి రోజుకే మళ్లీ బెల్టు దుకాణం ఓపేన్ చేశారు. అధికార పార్టీ నాయకుల అండతో వారికి అడ్డులేకుంటా పోయిందని తెలుస్తోంది.

> **బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడంతో యువత మద్యానికి బానిసై తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. బెల్టుషాపుల తొలగించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో మద్యం అమ్మకాలను అరికట్టడంపై ఎక్సైజ్ శాఖ, పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలి.
>
> – పంపన్నగౌడ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి
>
> **ఎంతటి వారినైనా ఉపేక్షించం**
>
> 
>
> గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే ఎంతటి వారిపైనా ఉపేక్షించం. కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టు షాపు నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే బెల్టుషాపులపై దాడులు చేసి రెండు కేసులు నమోదు చేశాం. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంచాం. పట్టుబడితే ఎంతటి వారినైనా సరే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.
>
> – వి. శ్రీనివాసులు, ఎస్ఐ, నందవరం

సబ్ జైలు సందర్శన


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌జైలును గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సందర్శించారు. సబ్‌జైలులోని ఖైదీల వివరాలు, ఖైదీలకు అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి జైలు పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. 70 సంవత్సరాలు పైబడిన మరియు ప్రాణాంతక, అనారోగ్య ఖైదీల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శివరామచంద్ర, ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, డా.జగదీష్, న్యాయవాది ఆనంద్, జైలు సూపరింటెండెంట్ డా.జగదీష్ పాల్గొన్నారు.

పక్కా గృహాలను మార్చిలోగా పూర్తి చేయాలి


కమిషనర్ ఎం.కృష్ణతో చర్చిస్తున్న హౌసింగ్ బోర్డు ఈఈ రవికుమార్, ఏఈ శివమూర్తి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలోని ఎన్టీఆర్ కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలను మార్చిలోగా పూర్తి చేయాలని కమిషనర్ ఎం.కృష్ణ, హౌసింగ్ బోర్డు ఈఈ రవికుమార్ సచివాలయ ఇంజనీరింగ్ సెక్రటరీలకు సూచించారు. గడువులోపు పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు స్వాధీనపరచాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో ఎన్టీఆర్ కాలనీలో నిర్మితమవుతున్న పక్కా గృహాల నిర్మాణాలపై కమిషనర్‌తో హౌసింగ్‌బోర్డు ఈఈ, ఏఈలు చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి ఆఖరినాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. 2,805 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంపై శ్రద్ధాశక్తులు చూపాలని తెలిపారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ-1 సుదర్శన్‌రెడ్డి

నందవరం : చిన్న పిల్లల విద్య, పోషణతో పాటు సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్‌లో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా కేఆర్‌పీలు డీఆర్పీలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యవేక్షకులు కల్పన, అపర్ణ, కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి రఫీక్, జిల్లా ప్రథమ కోఆర్డినేటర్ దావీదు, ఎంఈఓ ప్రారంభించారు. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల బాల్య ఆరంభ దశలో పోషణ, విద్యతో పాటు సమగ్ర అభివృద్ధికి తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు వారి ఎదుగుదలకు పౌష్టికాహారం, జీవన శైలి. పరిశు భ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నా రు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత, జ్ఞానజ్యోతి శిక్షణ కేఆర్‌పీలు వెంకరమణ, సీఆర్‌ఎంటీ ఉరుకుంద పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి పూజలు


హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంకష్టహర చతుర్థి పూజలు, ధనుర్మాస పూజలు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు 20 నెలలు సంకష్టహర చతుర్థి వ్రతం ఆచరించిన 30 మంది భక్తులు 21వ నెల సందర్భంగా హోమంలో పాల్గొన్నారు. అదేవిధంగా ధనుర్మాసం సందర్భంగా విష్ణు సహస్రనామావళి పారాయణం, శ్రీలక్ష్మి గణపతి హోమం, లక్ష్మి అస్టోత్తరం, తిరుప్పావై పాశురాలు, గోవింద నామాలు, సామూహికంగా పారాయణం జరిగింది. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సెక్రటరీ వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ టి.జి. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ టీచర్‌ను కొనసాగించాలి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని పార్లపల్లె గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పనిచేసే సోషల్ టీచర్‌ని వర్క్ అడ్జెస్ట్మెంట్ కింద వేరే పాఠశాలకు పంపవద్దని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకుడు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాఠశాల ముందు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. తమ పాఠశాల సోషల్ టీచర్ జమీమను వేరే పాఠశాలకు పంపిస్తే తాము ఇబ్బందులు పడతామని వాపోయారు. 10వ తరగతిలో 46 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు సోషల్ టీచర్ పనిసర్దుబాటు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం


పార్టీ జెండాను అవిష్కరిస్తున్న నాయకులు

పెద్దకడబూరు : మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో గురువారం సీపీఎం మండల 3వ మహాసభను ఏర్పాటు చేశారు. ముందుగా పార్టీ సీనియర్ నాయకులు పరమేష్ పార్టీ జెండాను అవిష్కరించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టించి ఇవ్వడం, చిన్నతుంబళంలో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించి హులికన్వీ, ఓంనగర్, నాగులాపురం, చిన్నతుంబళం, బసలదొడ్డి గ్రామాలకు తాగునీరు ఇవ్వడం వంటి సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా తిక్కన్నతో పాటు హనుమంతు, ఈరన్న, వెంకటేశ్వర్లు, దేవదాసు, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, రామన్న, జయరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు


పనులు చేస్తున్న వాటర్ సిబ్బంది

కౌతాళం: గుడికంబాలి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ సిద్దేశ్ తెలిపారు. గ్రామంలో పైప్‌లైన్ పగిలి పోవడంతో తాగునీటి సరఫరా నిలిచి పోయిందని, పైపులైనుకు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతోనిరంతరంగా గ్రామ అభివృద్ధికి పాటు పడుతాం అన్నారు. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నో అభివృద్ధి పనుల్ని చేపట్టినట్లు వెల్లడించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


ఖాదర్‌లింగ స్వామి దర్గా

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాలెం ఎస్సీ కాలనీలో ప్రాజెక్ట్ క్రైస్ట్ ఆఫ్ ఇండియా చర్చ్ పాస్టర్ ప్రేమ్ కుమార్, పాస్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. బైబిల్ గ్రంథంలోని ముఖ్యమైన అంశాలు వివరించారు. అనంతరం క్యాండిల్స్‌ను వెలగించి ప్రార్థనలు చేశారు. యువకులు, చిన్నారులు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాస్టర్లు శ్రీనివాసులు, చిదానంద, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

అరసం అధ్యక్షుడికి అవార్డు రావడం అభినందనీయం

ఆదోని సెంట్రల్: అరసం జాతీయ అధ్యక్షుడు పెనగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అభినందనీయమని కర్నూలు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, ప్రముఖ కథా రచయిత డా. హరికిషన్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆయన రచించిన 'దీపిక' అనే అభ్యుదయ వ్యాస సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ వారు అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. అరసం సంఘం సభ్యులు కేసి మల్లికార్జున, పుల్లా రామాంజినేయులు, సోమ భూపాల్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదోని పట్టణం, గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పద్మజ, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం

వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేసేందుకు సమీక్ష సమావేశం నిర్వహించామని ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానంగా బసాపురం ఎస్ఎస్ ట్యాంక్‌కు 60 నుంచి 70 శాతం నీటిని నింపుతామని, రాంజల చెరువులో ఉన్న విషపునీటిని తోడేసి కొత్త నీటిని తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నింపుతామన్నారు. ఆ నీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు నీటి సరఫరా చేస్తామన్నారు. జనాభాకు సరిపోయేంత నీటిని అందించాలని ప్రణాళికలను వేస్తామన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

పెద్దకడబూరు : రెవెన్యూ సిబ్బంది సమన్వయం పాటించి ప్రజా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనాథ్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అత్యధిక రెవెన్యూ గ్రీవెన్స్ పెండింగ్స్ పెద్దకడబూరు మండలంలోనే ఉన్నాయని మండిపడ్డారు. వీటిపై వీఆర్‌ఓలు, సర్వేయర్లు యాక్షన్ ప్లాన్ చేసుకొని భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. వీటిపై ఎప్పటికప్పుడు తహసీల్దారు పర్యావేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ సర్వేయర్ అల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత


ట్రాక్టర్ల నిలిపివేసిన పంచాయతీ కార్యదర్శి,గ్రామస్తులు

గోనెగండ్ల : మండల పరిధిలోని గంజిహళ్లి వద్ద హంద్రీనదిలోకి ఇసుక కోసం గురువారం 50 ట్రాక్టర్లు వచ్చాయి. దీంతో గ్రామస్తులు ఆ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పోలీసులు, గ్రామస్తులు హంద్రీనదిలోకి వెళ్లి ఇసుకను లోడ్ చేసుకుంటున్న ట్రాక్టర్లను వెనక్కి పంపారు. ఇసుక వ్యాపారం చేస్తున్న కొందరు ఇసుక అక్రమార్కులు హంద్రీనదిలో నుంచి ఇసుకను తోడుకొని విక్రయిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ల వల్ల రోడ్లు, పొలాలకు వెళ్లే దారులు దెబ్బతుంటున్నాయని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ వినియోగదారుల వారోత్సవాలు ప్రారంభం


ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: పట్టణంలోని సాయిడిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల ర్యాలీని గురువారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల వారోత్సవాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజారఘువీర్, తహసీల్దార్ శివరాముడు, వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యదర్శి శివమోహన్‌రెడ్డి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ వలీబాషా, ఆదోని డివిజన్ వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్ ఈషాబాషా, కార్యదర్శి గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు ఉపాధ్యాయుడి బలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో సైన్స్ ఉపాధ్యాయుడు సిద్ధయ్య శెట్టి బలయ్యాడని యూటీఎఫ్ నాయకులు నాగమణి ఆరోపించారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా గురువారం రాత్రి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదటు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జ్యోతికి అందజేశారు. పరీక్షా పేపర్లను ఎంఆర్‌సీ నుంచి పాఠశాలకు తీసుకెళుతుండగా రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందాడన్నారు. పరీక్షా పేపర్లను పాఠశాలలకు చేర్చాల్సి వుండగా.. ఆ విధానం పాటించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దావీదు, కొలన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కౌతాళం: ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారాజు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్‌క్యాంపును వారు గ్రామ సర్పంచ్ గోవిందుతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆధార్‌కార్డులు తీయించుకోని వారు తప్పక తీయించుకోవాలని, ప్రధానంగా 6సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లలు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

ఆదోని టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం సాయంత్రం ఆదోని డిపోకు కొత్తగా వచ్చిన రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఆయన పూజ చేసి ప్రారంభించారు. డీఎం రఫిక్‌అహ్మద్ మాట్లాడుతూ.. ఆదోని డిపోకు కొత్తగా 19 బస్సులు వచ్చాయన్నారు. అందులో ఎక్స్‌ప్రెస్‌లు 13, సూపర్ లగ్జరీ 3, అద్దె బస్సులు 2, పల్లెవెలుగు 1 బస్సులు ఉన్నాయన్నారు. ఆదోని–హైదరాబాద్‌కు 2 సర్వీసులు, ఆదోని–బెంగళూరుకు–4, ఆదోని– అనంతపురం–3, ఆ దోని–కర్నూలుకు–3, ఆదోని–శ్రీశైలం– 5 బస్సు సర్వీసులు, ఆదోని–పత్తికొండ–1 చొప్పు న సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎఫ్ వేణుగోపాల్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరం

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర వినతులను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సుపరిపాలన వారోత్సవాలను చేపడుతుందన్నారు. సమస్యలు ఉన్న వారు వినతి పత్రాలు అందజేయాలన్నారు.